❖•❖•❖ 55 ❖•❖•❖

# దైవిక నిదర్శనమునకు ప్రతిస్పందించుట

*"శతాధిపతియు అతనితో కూడ యేసునకు కావలియున్నవారును, భూకంపమును జరిగిన కార్యములన్నిటిని చూచి, మిక్కిలి భయపడి, 'నిజముగా ఈయన దేవుని కుమారుడే!' అని చెప్పుకొనిరి" (మత్తయి 27:54).*

*"ఆయనకెదురుగా నిలిచియున్న శతాధిపతి, ఆయన ఈలాగు ప్రాణము విడుచుట చూచి, 'నిజముగా ఈ మనుష్యుడు దేవుని కుమారుడే!' అని చెప్పెను" (మార్కు 15:39).*

*"శతాధిపతి జరిగినది చూచి, 'ఈ మనుష్యుడు నిజముగా నీతిమంతుడై యుండెను' అని చెప్పి దేవుని మహిమపరచెను" (లూకా 23:47).*

సిలువ దిగువ భాగాన నిలువబడియుండి యేసునందలి ఆయన విశ్వాసమును ప్రకటించిన శతాధిపతిని గూర్చి సువార్తల రచయితలలో ముగ్గురు పేర్కొన్నారు. శతాధిపతియు "అతనితో కూడ ఉన్నవారును" జరుగుచుండిన కార్యములన్నిటిని చూచి, భయపడుచు యేసు ఎవరై యుండెనో ఒప్పుకొనగా శతాధిపతి యేసును గూర్చి అత్యంత ప్రస్ఫుటమైనదియు ముక్కుసూటియైన ప్రకటన చేశాడని మత్తయి వ్రాస్తున్నాడు. శతాధిపతి, ముఖ్యంగా యేసు ఈలాగున ప్రాణము విడుచుట చూచిన తరువాత ప్రభావితుడై, "నిజముగా ఈ మనుష్యుడు దేవుని కుమారుడై యుండెను!" అని బహిరంగముగా నొక్కివక్కాణించాడని మార్కు చెప్పుచున్నాడు. బుద్ధిపూర్వకముగాను, ప్రశాంతముగాను యేసు తన తుది శ్వాస విడుచుటనుబట్టి ఒప్పించబడినప్పుడు, శతాధిపతి, "దేవుని మహిమపరచుటకు మొదలుపెట్టి" "నిజముగా ఈ మనుష్యుడు నీతిమంతుడై యుండెను" అని పలికాడని లూకా కూడా వ్రాస్తున్నాడు.

యేసు మన హృదయాలకు ఎల్లప్పుడు ఏదో ఒక పరీక్ష పెట్టుచునే యున్నాడు, కానీ మరి ముఖ్యముగా ఆయన మరణము యొక్క స్వభావము గూర్చి పరీక్షిస్తుంటాడు. ఆయనే "మార్గము, మరియు సత్యము మరియు జీవమునై యున్నాడు" (యోహాను 14:6), కానీ ఆయనతో మనమేమి చేయాలనుకునేది మనము తీర్మానించుకొనవలెను. మనము ఎటువంటి హృదయమును కలిగియున్నామో మనము తీసికునే తీర్మానము బయలుపరుస్తుంది.

క్రొత్త నిబంధనలో నలుగురు వెవ్వేరు శతాధిపతులు పేర్కొనబడియున్నారు, ప్రతి ఒక్కరు ముదావహమైన తీరులో చిత్రీకరింపబడియున్నారు. మొదటి శతాధిపతి, "అతడు మన

జనులను ప్రేమించి మనకు సమాజమందిరము తానే కట్టించెను" అని ఆయనను గూర్చి యూదులు చెప్పిన శతాధిపతి (లూకా 7:5). ఇతని చిత్తశుద్ధిగల విశ్వాసము గూర్చే యేసు, "ఇశ్రాయేలులోనైనను ఇంత గొప్ప విశ్వాసము నేను చూడలేదు" అని చెప్పాడు (లూకా 7:9). రెండవ శతాధిపతి, అత్యధికంగా గౌరవింపబడిన శతాధిపతిని, అపొస్తలులకార్యములు 10వ అధ్యాయంలో ఇటలీ పటాలమునకు నాయకుడైన వానిని చూడగలము. ఆయనే కొర్నేలీ, "తన యింటివారందరితో కూడ దేవునియందు భయభక్తులుగలవాడై యుండినవాడు ..." (అపొస్తలుల కార్యములు 10:2). క్రీస్తునంగీకరించిన మొట్ట మొదటి అన్యుడు ఈయనే. మూడవ శతాధిపతి, పౌలు రోమా పట్టణమునకు తీసికొనిపోబడుచుండినప్పుడు, పౌలు బాధ్యత అప్పగింపబడిన ఔగుస్తు పటాలములో శతాధిపతియై యుండిన యూలి. "పౌలు మీద దయగా ఉండి, అతడు తన స్నేహితులయొద్దకు వెళ్లి పరామరిక పొందుటకు అతనికి సెలవిచ్చెను" అని ఇతని గూర్చి లూకా చెప్పుచున్నాడు (అపొస్తలుల కార్యములు 27:3). అటుతరువాత ప్రయాణంలో ఓడ బ్రద్దలైనప్పుడు, పౌలు ప్రాణాన్ని కాపాడింది కూడ ఇతడే అని లూకా వ్రాయుచున్నాడు (అపొస్తలుల కార్యములు 27:42, 43). ఇక నాలుగవ శతాధిపతి, యేసు సిలువమరణము నొందిన తరువాత సిలువ దిగువ భాగమునకు వెళ్లి యేసు ఎవరై యున్నాడని ఆయన విశ్వసించుచుండిన సత్యమును బహిరంగముగా ప్రకటించినవాడు (మత్తయి 27:54; మార్కు 15:39; లూకా 23:47).

నియమము ప్రకారమైతే సైన్యములోని అత్యుత్తములైనవారే శతాధిపతి పదవిలో నియామకము చేయబడిరని రెండవ శతాబ్దపు రచియిత, పోలిబస్ చెప్పాడు. క్రొత్త నిబంధన ఈ నలుగురు శతాధిపతుల గూర్చి క్లుప్తమైన వర్ణనల నిచ్చుచు, సిలువ యొద్ద నుండిన శతాధిపతి సాక్ష్యమును స్థిరీకరించుచున్నది.

సిలువచెంత నుండిన ఈ శతాధిపతి ఏమి చూశాడో ఏమి విన్నాడో ఒక్కసారి ఆలోచించండి. సిలువ మరణమునకు సంబంధించిన అన్ని దశలు ఆయన ఆధ్వర్యంలో నిర్వహింపబడవలెనని ఆయనకు అప్పగింపబడినట్లయితే, తీర్పు తీర్చబడుటకు యేసు పిలాతు యెదుటికి తీసికొనిరాబడినది మొదలుకొని ఆయన సిలువవేయబడునంత వరకు కూడా ఆ బాధ్యత నంతటిని ఆయన చేపట్టియుండును. అప్పుడాయన యేసు సిలువవేయబడుట మాత్రమే కాదు, కానీ ఈ ఘోర మరణము వరకు జరిగిన సంఘటనలన్నింటిని చూచియుండును. యేసు కొరడాతో కొట్టబడుట కళ్లారా చూచియుండును, యేసును యూదుల రాజని ఎగతాళి చేసినప్పుడు అక్కడా ఉండేవాడు, యేసు నుదిటిపై ముళ్ల కిరీటము గుచ్చబడుట, ఎర్రని వస్త్రము ఆయనకు ధరింపజేయబడుట, రాజదండమును పోలిన రెల్లు ఆయన చేతులకు అందింపబడుట, తెలియజేయుచుండిన హేళనను చూచియుండును. ఆయన మీద అతి చెడ్డ హేళనగా ఉమ్మివేయబడుచుండుటను చూచియుండును. దీనంతటికి తోడుగా, కలువరి గిరి వరకు ఊరేగింపును నిర్వహించిన సైనిక దళం బాధ్యత కూడా ఆయనపైనే పడేది. సిలువను మోయుటలో యేసుకు తోడ్పడునట్లు కురేనీయుడైన సీమోను పిలువబడినప్పుడు ఈయన అందుబాటులో ఉండేవాడు. సిలువకు కొద్ది దూరములోనే ఉంటూ యేసు ఈ అవమానమును, ఎగతాళిని, మరియు పరిహాసమునంతటిని ఎంత మహత్వపూర్ణంగాను వైభవోపేతంగాను భరించుచుండెనో ఆయన గమనించియుండును.

ఇలా ఆలోచించుట కొంచెము కష్టమే అయినా, ఈ శతాధిపతి యేసు మేకులతో సిలువకు

కొట్టబడినప్పుడు ఆయన ప్రక్కలోనే నిలువబడియుండును; బహుశ యేసు సిలువకు కొట్టబడిన తరువాత ఆ సిలువను నిటారుగా నిలువబెట్టు సందర్భములో సహాయము చేసియుండును; ఆరు గంటల సమయాన్ని హాస్యాస్పదమును విపరీతమైనదైన సన్నివేశమును చూస్తూ అక్కడే సిలువ యొద్దనే గడిపేవాడు. మధ్నాహ్న సమయంలో దేశమంతటిని చీకటి కమ్ముకొన్నప్పుడు, ఆయన దానిని చూచి, అదెంతటి భయానకంగా ఉంటుందో అనుభూతిచెంది, భయంతో కంపించేవాడు; ఏదిఏమైనా, ఇతరులు అక్కడ నుండి తప్పుకొని తమ తమ ఇళ్ల క్రిందే "భూమి వణకినప్పుడు బండలు బద్దలైనప్పుడు" వినబడిన గర్జనను విని దాని ప్రభావమును అనుభవించి యుండును (మత్తయి 27:51).

దీనంతటిని బలమైన ప్రభావముగలది మరియు ఉత్తమోత్తమైన విషయాన్ని కూడా, యేసు తన తుది శ్వాస విడుచుచు తన ప్రాణమును లోక రక్షణార్థమై అప్పగించుటను ఈయన గమనించియుండును. సిలువ మీద నుండి పలుకబడిన ప్రతి పలుకును ఆయన స్పష్టంగా వినియుండును; యేసు యొక్క చిత్తవృత్తిని మరియు హావభావాలను చూచియుండును, దేవుని కుమారుడు తన తుది శ్వాస విడుచుటకు ఎన్నుకొన్న విధానాన్ని కళ్లారా, అతి సమీపంగా ఉండి చూచియుండును.

బహుశ, ఈ శతాధిపతికి దక్కిన ప్రత్యేకార్హత ప్రపంచ చరిత్రలోని ఇతరులు యింకొందరికి మాత్రమే దొరికేది. విశ్వాసమును పుట్టించుటకు యేసు సిలువపై మరణము నొందుట ద్వారా దేవుడిచ్చిన రుజువంతయు ఈయన కళ్ల ముందు ఒక కవాతుగా సంభవిల్లినది! ఇంత గొప్ప పరిమాణములో ఉండిన నిదర్శనముతో ఇప్పుడు ఈయన ఏంచేస్తాడు? ఆయన దీనంతటి గూర్చి ఏమీ పట్టించుకొనకుండానే మిగిలిన విధులను నెరవేర్చుటకు వెళ్లిపోవాలా? కొందరు సరిగ్గా యిదే పని చేసినట్లు లూకా వ్రాయుచున్నాడు: "చూచుటకై కూడివచ్చిన ప్రజలందరు జరిగిన కార్యములు చూచి, రొమ్ము కొట్టుకొనుచు తిరిగి వెళ్లిరి" (లూకా 23:48), ఈ శతాధిపతి తాను విన్నవాటి గూర్చి కన్నవాటి గూర్చి ఇప్పుడేంచేయాలి?

*నిదర్శనమును బహు జాగ్రత్తగా గమనించుటకు ఆయన చాలినంత మనఃపూర్వకమైనవాడై యుండెను.* ఆనకట్టంతటి ఈ నిదర్శనము ఆయన దృష్టిని ఆకర్షించకుండా తప్పిపోకుండునట్లు ఈ శతాధిపతి అత్యంత చిత్తశుద్ధిగలవాడై యుండెను. "ఈ విషయాలను నేను తప్పక గమనించి వాటి గూర్చి ఆలోచించాల్సిందే. నేను వీటి గూర్చి యోచించకుండునట్లు ఇవి చాలా చాలా అసాధారణమైనవై యున్నవి" అని ఆయన తనలో తాను చెప్పుకొనియుండును. ఒక విధంగా చూస్తే, మండుచుండిన పొదను చూచిన మోషే తబ్బిబ్బై, "ఆ పొద యేల కాలిపోలేదో నేను ఆ తట్టు వెళ్లి యీ గొప్ప వింత చూచెదను" అని తనలో తాను అనుకొన్నట్లు ఈయన కూడా ఆశ్చర్యముతో ఆందోళన చెందాడు (నిర్గమకాండము 3:3).

స్పష్టంగా, వారి కళ్ల ముందే ఏమి జరిగిందో అసంఖ్యాకులైన ఇతరులు గమనించలేదని తెలియుచున్నది. వారు చూశారు, కానీ చూడలేదు. బహుశ, వారు "యెల్లప్పుడును నేర్చుకొనుచున్నను, సత్యవిషయమైన అనుభవ జ్ఞానము ఎప్పుడును పొందలేని అవివేకులైరి" అని వారి గూర్చి చెప్పుకొనవచ్చును (2 తిమోతి 3:6–7). అయితే, ఈ శతాధిపతి విషయంలో, ఇది నిజం కాదు.

*ఈయన రుజువును అంగీకరించగలిగినంత నిజాయితీపరుడై యుండెను.* ఈ శతాధిపతి రుజువును కేవలము అధ్యాయనము చేసి ఊరుకొనలేకపోయాడు; ఆయన

దానిని అంగీకరించాడు. ఆయన దానిని అలక్ష్యము చేయలేనంతగా అది సంపూర్ణమైనియు అత్యంతాశ్చర్యమును కలిగించునదై యుండెను. "శతాధిపతి జరిగినది చూచి, ఈ మనుష్యుడు నిజముగా నీతిమంతుడై యుండెను అని చెప్పి దేవుని మహిమపరచెను" అని లూకా వ్రాయుచున్నాడు (లూకా 23:47).

తుదకు ఈ నిదర్శనము ఆయన మనస్సులో మూడు అభిప్రాయములను నెలకొల్పినది. మొదటిదిగా, యేసు "నీతిమంతుడై యుండెను" అని చూపించింది. పరిస్థితి దృష్ట్యా. ఈ వాస్తవము, అనివార్యమైనది. యేసు నీతిమంతుడు కానట్లయితే, ఆయన దేవుని కుమారుడు కాదు; ఆయన దేవుని కుమారుడు కానట్లయితే, మనకు రక్షకుడై యుండలేడు. ఆయన ఇచ్చు నిదర్శనము యేసు లోక పాపముల నిమిత్తమై వధింపబడిన నిష్కళంకమైన గొఱ్ఱెపిల్లయై యుండెనని చిత్తశుద్ధిగల ప్రతి హృదయమును ఒప్పింపవలెననునదే ఎల్లప్పుడూ దేవుని ఆశయమైయున్నది.

రెండవదిగా, ఆయన దేవుని స్తుతించునట్లు ఈ నిదర్శనము ఆయనను నడిపించినది. ఆయన దేవుని స్తుతించుటకు మొదలు పెట్టి, ఆపకుండా స్తుతించుచునే యుండెనని గ్రీకు భాషలో గల వాక్యభాగము తెలియజెప్పుచున్నది. విశ్వాసము యొక్క తుది ఫలితార్థము ఎల్లప్పుడును దేవుని స్తుతించుటయే, మన పిల్లలు దేవుని స్తుతించనంత వరకు మనము వారిని పెంచిపోషించుట ముగియలేదు; మరియు మనము దేవుని స్తుతించనంత వరకు యేసుకు సంబంధించిన రుజువును మనము సంపూర్తిగా అంగీకరించలేదన్నట్లే.

మూడవదిగా, యేసు నీతిమంతుడు మాత్రమే కాదు, కానీ ఆయన "దేవుని కుమారుడై యుండెను" అని అందరికి వినబడునట్లు బిగ్గరగాను బహిరంగముగాను పలుకునట్లు ఈ నిదర్శనము ఆయనకు ప్రోద్బలమునిచ్చినది (మార్కు 15:39).

*ఆయన ఈ నిదర్శనమును బహిరంగముగా అంగీకరించుటకు చాలినంత వినయమనస్కుడై యుండెను.* ఔను, ఈ శతాధిపతి విశ్వసించాడు. అంగీకారయోగ్యముగా, ఈ అంశము తరుచుగా తర్జనభర్జన గావింపబడుచున్నది. యేసు ఎవరో ఒక ప్రత్యేకమైన వ్యక్తియై యుండెనని ఊరకనే ఆయన తన తుది అభిప్రాయాన్ని తెలిపాడా, లేక యేసు వాస్తవంగా దేవుని కుమారుడైయుండెనవి చెప్పాడా? ఈ రెండింటిలో ఆయన చెప్పినదేమిటి? అని వాదింపబడుచున్నది.

యేసు ఎదుర్కొన్న తీర్పు, ఈ శతాధిపతి తప్పకుండా హాజరై యుండి జరిగిన ప్రక్రియనంతా చూచిన మరియు వినియుండిన వివరములు, ఆయన దేవుని కుమారుడని యేసు స్వాధికారముతో ప్రకటించిన విషయమును గూర్చినదై యుండినదని మనము జ్ఞాపకముంచుకొనవలెను. యూదులు చేసిన వాదములో చిట్టచివరిదై యుండిన ఒకటి ఏమనగా, "ఆయన దేవుడని చెప్పుకొన్నాడు!" వారు, "మాకొక నియమము కలదు, తాను దేవుని కుమారుడనని ఇతడు చెప్పుకొనెను గనుక ఆ నియము చొప్పున ఇతడు చావవలెను" అని పిలాతు యెదుట చెప్పారు (యోహాను 19:7). వారు చేయుచుండిన వాగ్వివాదము పిలాతును భయపెట్టినది, గనుక పిలాతు యేసును ప్రేతోర్యములోనికి తీసికొనివెళ్లి అక్కడ ఆయనను దాని గూర్చి యింకా ఎక్కువగా ప్రశ్నించాడు. తీర్పు సమయంలో యేసుపై మోపబడిన ఈ అపనిందల గూర్చి శతాధిపతి ఖచ్చితంగా ఎరిగియుండెను. యేసు ప్రవర్తించిన తీరు మరియు ఆయన మరణమును చుట్టుముట్టి యుండిన సహజాతీతమైన దృగ్విషయాల

నిదర్శనమును ఈయన ఆధ్యయనము చేసినప్పుడు, ఆయన ఎవరై యున్నాడని యేసు చెప్పుకొనుచుండెనో అదే అయియున్నాడని ఆయన ఒప్పించబడ్డాడు. ఈ వివరాలన్నిటిలో గల సత్యమును పట్టుకొనుటకు, యేసు గూర్చి ఈయన చేసిన ప్రకటన గల ప్రతి వాక్య భాగము యొక్క సంధర్భమును మనము అతి జాగ్రత్తగా చూడవలెను. అలా చేసినప్పుడు, యేసు దేవుని కుమారుడైయుండెనని శతాధిపతి బహిరంగముగా తాను ప్రకటించక మునుపే ఆయనను నమ్మాడను తుది అభిప్రాయమునకు వత్తుము.

ఒక సహృదయము యేసు ఎవరై యుండెనో తెలియజెప్పు దైవికమైన సాక్ష్యమును ఎదుర్కొన్నప్పుడు అది ఏమి చేయునో చూపించుటకు లేఖనముల పుటల్లో ఈ శతాధిపతి ఒక ఉదాహరణముగా చిరకాలము నిలిచియుంటాడు. ఇటువంటి సుహృదయము రుజువును జాగ్రత్తగా అధ్యయనము చేస్తుంది. అది నిజమని నిజాయితీగా దానిని అంగీకరిస్తుంది, మరియు అప్పటి నుంచి అదే జీవితము యొక్క పరమార్థ సత్యమని ఎంచుతుంది.

మన ఒక్కొక్కరి గూర్చిన బృహత్ సత్యము, మూలాధారమును అత్యంత ముఖ్యమునై యున్న సత్యము ఏమనగా: "జీవితమును గూర్చి అత్యంత యథార్థంగా సత్యముతో, యేసు దేవుని కుమారుడై యున్నాడను సత్యముతో, నేనేంచేశాను?"

❖◆❖◆❖

*"... 'ఇదిగో, విత్తువాడు విత్తుటకు బయలు వెళ్లెను; కొన్ని విత్తనములు ... మంచి నేలను పడి, ఒకటి నూరంతలుగాను, ఒకటి అరువదంతలుగాను, ఒకటి ముప్పదంతలుగాను ఫలించెను. చెవులుగలవాడు వినునుగాక' " (మత్తయి 13:3-9).*